నుమాయిష్‌లో సండే.. సందడి

నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో కొనసాగుతున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. సెలవు దినం కావడంతో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దీంతో ఎగ్జిబిషన్ మైదానంలోని స్టాల్స్‌కు గిరాకీ పెరిగింది. అమ్యూజ్‌మెంట్ పార్క్, ఫుడ్ కోర్టులలో సందర్శకుల సందడి అధికమైంది. శనివారం భారీగా సందర్శకులు తరలి రాగా, ఆదివారం వారి సంఖ్య మరింత పెరిగింది.

- అబిడ్స్, జనవరి 7

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం వద్ద సందర్శకుల సందడి

వాటర్ గేమ్స్ ఆడుతున్న చిన్నారులు

ప్రసూతి మరణాల తగ్గింపులో తెలంగాణ నం.1

ప్రసూతి అండ్ గైనకాలజి సొసైటీ ప్రతినిధులు

సిటీబ్యూరో, జనవరి 7(నమస్తే తెలంగాణ): దేశంలో ప్రసూతి మరణాలను తగ్గించేందుకు ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలతో పాటు ప్రసూతి అండ్ గైనకాలజి సొసైటీ (ఏఐసీఓజీ), ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్ అండ్ గైనకాలజి సొసైటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఓజీఎస్ఐ) సైతం తమ వంతు కృషి చేస్తున్నాయని ప్రసూతి అండ్ గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ ఆర్గనైజింగ్ చైర్ పర్సన్, ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఎస్.శాంత కుమారి అన్నారు. హైటెక్స్‌లోని హెచ్ఐసీసీలో ఆదివారం నిర్వహించిన ఏఐసీఓజీ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.శాంత కుమారి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పరిశీలిస్తే తెలంగాణ రాష్ట్రంలో మాతా శిశు మరణాల రేటు చాలా తక్కువగా ఉందన్నారు. అతి త్వరలోనే మాతృ మరణాల రేటు సింగిల్ డిజిట్‌కు చేరుకోవచ్చన్నారు.

ఉపాధ్యాయ, ఉద్యోగుల స్థానిక సమస్య పరిష్కరించాలి

ఖైరతాబాద్, జనవరి 7: ఉపాధ్యాయ, ఉద్యోగుల స్థానిక సమస్యను పరిష్కరించాలని జీవో 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు విజయ్ కుమార్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో 317 వల్ల ఆయా వర్గాల్లో స్థానికతతో పాటు కుటుంబాలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తమ మ్యానిఫెస్టోలో ఈ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, దానిని నిలబెట్టుకోవాలన్నారు. సమావేశంలో సంఘం డబ్ల్యూపీ నాగేశ్వర్ రావు, సందీప్, రత్నమాల పాల్గొన్నారు.

మేడ్చల్‌లో మరో రెండు అర్బన్ పార్కులు

మేడ్చల్, జనవరి 7(నమస్తే తెలంగాణ): మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో మరో రెండు అర్బన్ పార్కులు సిద్ధమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 15 అర్బన్ పార్కులు ఉండగా, యాద్గార్‌పల్లి, గౌడవెల్లిలో అర్బన్ పార్కులను అటవీ శాఖ ఏర్పాటు చేస్తున్నది. జిల్లా వ్యాప్తంగా 8093.38 హెక్టార్ల అటవీ భూమి ఉంది. పచ్చదనం పెంపుతో పాటు హైదరాబాద్ నగర ప్రాంత ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు అర్బన్ పార్కులను అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం విదితమే. మరో వైపు ప్రత్యేక పర్యవేక్షణతో జిల్లాలో 24 శాతం ఉన్న పచ్చదనం 33 శాతానికి పెంచే లక్ష్యంగా అటవీ శాఖ అధికారులు కృషి చేస్తున్నారు.

జిల్లాలో 40 ఫారెస్ట్ బ్లాకులు

జిల్లాలో 40 ఫారెస్ట్ బ్లాకులు ఉండగా, ఇందులో 15 అర్బన్ పార్కులను ఏర్పాటు చేశారు. భ్యాగనగరం నందనవం(నారపల్లి), జటాయువు(మేడిపల్లి), శాంతివనం(మేడిపల్లి), ప్రశాంతివనం(దూలపల్లి), ఆక్సిజన్ పార్క్(దూలపల్లి), ఆయుష్‌వనం(బాహుదూర్‌పల్లి), ఆక్సిజన్ పార్కు(కండ్లకోయ), ఆరోగ్యవనం పార్కు (నాగారం), ధర్మారం పార్కు (ఉప్పర్‌పల్లి), ప్రాణ వాయువు పార్కు (గాజుల రామారం), కీసర పార్కు(కీసర), తుర్కపల్లి పార్కు (తుర్కపల్లి), కొండగొర్రె పార్కు (లాల్‌గడి మలక్‌పేట), వెదురు వనం పార్కు (తూంకుంట), యల్లంపేట పార్కు (యల్లంపేట)లు ఉన్నాయి.

రెవెన్యూ శాఖ మంత్రికి వినతి

ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనకబడిన ముదిరాజ్ కులస్తులను బీసీ 'డీ' నుంచి బీసీ 'ఏ' జాబితాలో చేర్చాలని అఖిల భారత ముదిరాజ్ (కోలీ) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొట్ల కాయల వెంకటేశ్వర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ఇ.శ్రీనివాస్ ముదిరాజ్‌లు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు.

- కవాడిగూడ, జనవరి 7

విజ్వల్లీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంధుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన క్యాలెండర్‌ను కోఠిలోని ఐఎంఏ భవనం – రిథమ్ కన్వెన్షన్ హాల్‌లో ఆవిష్కరిస్తున్న రాష్ట్ర విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, తదితరులు

- సుల్తాన్ బజార్, జనవరి 7

ముస్లిం సోదరికి రాములోరి అక్షింతలు

ముస్లిం సోదరికి అయోధ్య రాముల వారి అంక్షితలు పంపిణీ చేస్తున్న కాలనీవాసులు

అల్లాపూర్, జనవరి 7: అయోధ్య రాముల వారి అక్షింతల పంపిణీ కార్యక్రమం ఓ ముస్లిం సోదరిని సైతం ఆకర్షించింది. పంపిణీ వాడవాడలా ఆధ్యాత్మిక వాతావరణంలో కన్నుల పండువగా జరుగుతుంది. అవంతినగర్ తోటలో కురుమ సంఘం అధ్యక్షుడు కురువ శశి ఆధ్వర్యం లో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. ఈ క్రమంలో ఓ ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. అంక్షతలు పంపిణీ చేస్తున్న వారిని చూసిన ఓ ముస్లిం మహిళ.. తనకు రాములోరి అక్షింతలు కావాలని అడిగి మరీ తీసుకుంది. ఇది చూసినవారు మతాలకు అతీతంగా శ్రీరాముడిని ఆరాధించడం పట్ల తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ.. జై శ్రీరామ్, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు పెద్ద పెట్టున చేశారు.

సెక్రటరీ వృత్తి ప్రోత్సాహమే కార్ప్‌కాన్ లక్ష్యం

ఐసీఎస్ఐ ప్రెసిడెంట్ మాన్సీ గుప్తా వెల్లడి

సమావేశంలో మాట్లాడుతున్న ఐసీఎస్ఐ ప్రెసిడెంట్ మాన్సీ గుప్తా

శామీర్‌పేట, జనవరి 7: సెక్రటరీల వృత్తిని ప్రోత్సహించడమే కార్ప్‌కాన్ సదస్సు లక్ష్యమని ఐసీఎస్ఐ ప్రెసిడెంట్ మాన్సీ గుప్తా అన్నారు. శామీర్‌పేటలోని నల్సార్ వేదికగా మూడు రోజులు పాటు ఐసీఎస్ఐ నల్సార్, నేషనల్ లా యూనివర్సిటీతో కలిసి కార్ప్‌కాన్ 2024 పేరుతో మొదటి జాతీయ పరిశోధనా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం ముగిసిన అనంతరం ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాన్సీ గుప్తా మాట్లాడుతూ, కంపెనీ సెక్రటరీల వృత్తిని ప్రోత్సహించడంతో పాటు నియంత్రించడం, అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో సదస్సు నిర్వహించినట్టు తెలిపారు. ఈ సదస్సులో 168 కంపెనీల కార్యదర్శులు, న్యాయవాదులు, న్యాయ నిపుణులు, మేధావులు పాల్గొన్నారని, కార్పొరేట్ చట్టాలు, పాలనా రంగంలోని తాజా పోకడలపై చర్చించామన్నారు. సదస్సుకు వచ్చిన 60 పరిశోధనా పత్రాలపై లోతుగా చర్చించామని, కార్పొరేట్ చట్టం, ఫైనాన్స్‌లో ఆసక్తిని కలిగి ఉన్న రంగాల్లో అవగాహన కల్పించామన్నారు. కార్పొరేట్ చట్టం, పాలన, వాటాదారుల ప్రయోజనం కోసం ప్రస్తుత చట్టాల్లో అవసరమైన మార్పులు తీసుకురావడానికి ఇలాంటి సదస్సులు ఉపయోగపడుతాయన్నారు. ఐసీఎస్ఐ తన కార్యకలాపాలను విస్తృతం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నల్సార్ వీసీ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావు, ఐసీఎస్ఐ వైస్ ప్రెసిడెంట్ సీఎస్‌బీ నర్సింహన్, సీఎస్ఆర్ వెంకట రమణ, సదస్సు డైరెక్టర్లు పాల్గొన్నారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 7: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎం.ఏ, ఎం.కామ్, ఎమ్మెస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎం.లిబ్.ఐఎస్సీ, ఎంజే అండ్ ఎంసీ తదితర కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 30వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు.

వివిధ కోర్సుల పరీక్షా తేదీలు

ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ప్రొ. రాములు తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్ కోర్సుల రెండు, మూడో సంవత్సరం మొదటి సెమిస్టర్ రెగ్యులర్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీ కామ్ ఎల్ఎల్‌బీ రెండు, మూడు, నాలుగు, ఐదో సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలను ఈ నెల 23వ తేదీ నుంచి, ఎల్ఎల్ఎం మూడో సెమిస్టర్ పరీక్షలను 27వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మత్స్యరంగంలో ఆధునిక విధానాలను అందిపుచ్చుకోవాలి

డాక్టర్ మోదడుగు విజయ్ గుప్తా

తెలుగు యూనివర్సిటీ, జనవరి 7: ప్రపంచ వ్యాప్తంగా మత్స్య రంగంలో వస్తున్న ఆధునిక విధానాలపై సాంప్రదాయ మత్స్యకారులలో అవగాహన కలిపించేందుకు కృషి చేయవలసిన అవసరం ఉందని పద్మశ్రీ అవార్డు గ్రహీత, మత్స్యరంగ నిపుణులు డాక్టర్ మోదడుగు విజయ్ గుప్తా అభిప్రాయం వ్యక్తం చేశారు. రెడ్‌హిల్స్ ఫ్యామ్సీలో ఆదివారం జరిగిన తెలంగాణ ఫిషరీస్ సొసైటీ ఆవిర్భావ సభకు ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ గుప్తా ప్రసంగిస్తూ చేపల ఉత్పత్తి ఉత్పాదకతలలో విప్లవాత్మకమైన మార్పు ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న తరుణంలో ఈ మార్పులకు అనుగుణంగా తెలంగాణలో మత్స్యకారులకు శిక్షణ సదుపాయాలను కలిపించవలసిన అవసరం ఉందని సూచించారు. సొసైటీ మాజీ అధ్యక్షులు పి.రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫిషరీస్ సొసైటీలకు జిల్లా స్థాయి కన్వీనర్లను నియమించారు.

మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలి

సిటీబ్యూరో, జనవరి 7(నమస్తే తెలంగాణ): రియల్ ఎస్టేట్ బిల్డర్లు, కొనుగోలుదారులకు మధ్య ఏర్పడిన ఫిర్యాదులను మధ్యవర్తిత్వం– రాజీ మార్గం ద్వారా త్వరితగతిన పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ రెరా చైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాల సమావేశ మందిరంలో లా పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో లా కళాశాల ప్రిన్సిపాల్, డీన్, హెచ్ఓడీగా పనిచేసి పదవీ విరమణ పొందిన ప్రొఫెసర్ కృష్ణమాచార్యులు కార్యక్రమంలో కృష్ణమాచార్యులు, నాగార్జున, సురేశ్, న్యాయవాది నంధ్యాల దయాకర్‌రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

సారస్వత పరిషత్ కృషికి పూర్ణకుంభ పురస్కారం

తెలుగు యూనివర్సిటీ, జనవరి 7: సుమారు ఎనిమిది దశాబ్దాలుగా తెలుగు భాషా సాహిత్యానికి ఎనలేని సేవలందిస్తున్న తెలంగాణ సారస్వత పరిషత్‌ను, పూర్ణ కుంభ పురస్కారాలతో పరిషత్ కార్యవర్గాన్ని ఆదివారం సత్కరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రాజ మహేంద్రవరంలో జరుగుతున్న రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభల వేదికపై పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. డాక్టర్ గజల్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలలో పద్మభూషణ్, డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, చైతన్య రాజు పాల్గొని ఏపీలో సారస్వత పరిషత్ నెలకొల్పేందుకు స్ఫూర్తిగా నిలిచిన తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి చెన్నయ్య చేస్తున్న కృషిని కొనియాడారు.

డాక్టర్ జుర్రు చెన్నయ్యను పూర్ణకుంభ పురస్కారంతో సత్కరిస్తున్న వక్తలు

అట్టహాసంగా ఎయిర్‌పోర్ట్ అథారిటీ క్రికెట్ టోర్నీ

బేగంపేట్ జనవరి 7: ఆలిండియా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్ 2024 ముగింపు వేడుకలు ఆదివారం బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా జరిగాయి. ఈ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన సెంట్రల్ జోన్ టీమ్‌కు, రన్నర్స్‌గా నిలిచిన వెస్ట్‌జోన్ టీమ్‌లకు ట్రోఫీలను అందించారు. దీంతో పాటు అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు తగిన ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సౌత్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌జీ ఫణిక్కర్ పాల్గొని బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడాకారులు మరింత స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఇలాంటి టోర్నమెంట్‌లు వివిధ ప్రాంతాలకు చెందిన వారి మధ్య స్నేహ భావాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ సీఐసీ జీఎం హజారీ, సదరన్ రీజియన్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన టోర్నమెంట్ ముగింపులో పాల్గొన్న వక్తలు

కొమురెల్లికి కురుమను చైర్మన్‌గా నియమించాలి

సీఎంను కోరిన ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

అబిడ్స్, జనవరి 6: కురుమల కుల దైవమైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానానికి చైర్మన్‌గా కురుమలను నియమించాలని ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. అదే విధంగా షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌తో పాటు ఇతర చైర్మన్ స్థానాలలో కురుమలకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రికి మరోసారి విజ్ఞప్తి చేస్తానని తెలిపారు. ఆలేరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన కురుమ కులానికి చెందిన బీర్ల ఐలయ్యకు ముస్లిం జంగ్ వంతెన వద్ద గల కురుమ సంఘం భవనంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ప్రజలకు ఏ విధమైన సమస్యలున్నా తన దృష్టికి తీసుకు వస్తే వారికి అండగా నిలబడ్తానని హామీనిచ్చారు. కురుమల అభ్యున్నతికి పాటుపడ్తానని, ఎవరికి ఇబ్బందులున్నా ఆదుకునేందుకు సిద్ధంగా ఉంటానన్నారు. ఎమ్మెల్సీ, రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు యెగ్గె మల్లేశం మాట్లాడుతూ జిల్లాల వారిగా కురుమల సమస్యల పరిష్కారానికి పాటు పడ్డామని, కురుమ సంఘం రాష్ట్ర భవనం మన్సూరాబాద్‌లో నిర్మించేందుకు పాటు పడినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు క్యామ మల్లేష్, కరీంనగర్ జడ్పీ మాజీ చైర్మన్, తుల ఉమ, జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్ కావ్య, కురుమ సంఘం రాష్ట్ర, నగర నాయకులు బండారు నారాయణ, తూముకుంట అరుణ్ కుమార్, కొలుపుల నరసింహ, కట్ట మల్లేశం, జీఎస్ శివకుమార్, బాలయ్య కురుమ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ, రాష్ట్ర కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యెగ్గె మల్లేశం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

మహిళల ప్రతిభను గుర్తించి గౌరవించాలి

పంచాయతి, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

మాదాపూర్, జనవరి 7: సమాజంలో మహిళలను గౌరవించి వారి ప్రతిభను గుర్తించినట్లయితే మరెన్నో విజయాలు అందుకోవడం ఖాయమని పంచాయతి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. పలు రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు వైశ్య లైమ్ లైట్ ఆధ్వర్యంలో రాయదుర్గం దర్గాలోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పంచాయతి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే బీగల గణేష్ గుప్తా, ఎమ్మెల్సీ బోగ్గారపు దయానంద్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డ్ మాజీ చైర్మెన్ కోలేటి దామోదర్ గుప్తా, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ బొల్లం సంపత్ కుమార్, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణ, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస, తెలంగాణ డైరీ ఫారం మాజీ చైర్మన్ సోమ భరత్‌లతో కలిసి మంత్రి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మహిళలకు అన్ని రంగాల్లో అవకాశం ఇస్తే ఏ విధంగా ముందుకు సాగుతారో అవార్డులు అందుకున్న మహిళలను చూస్తే అర్థమవుతుందని చెప్పారు. అనంతరం మంత్రి సీతక్క ఆయా రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు వైశ్య లైమ్ లైట్ అవార్డులను ప్రదానం చేశారు.



పలు రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు అవార్డులను అందజేస్తున్న మంత్రి సీతక్క

సామాజిక భద్రతా చట్టాన్ని అమలు చేయాలి

ముంబైలో జరిగిన సమావేశంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

సమావేశంలో మాట్లాడుతున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

సిటీబ్యూరో, జనవరి 7(నమస్తే తెలంగాణ): అసంఘటిత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి, రక్షణల కోసం సామాజిక భద్రతా చట్టాన్ని అమలు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పెద్ద లింగన్న గారి శంకర్ డిమాండ్ చేశారు. జాతీయ ప్రజా ఉద్యమాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు జరుగుతున్న జాతీయ సదస్సుకు వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసంఘటిత కార్మికులకు భద్రతను కల్పించే 2008 చట్టాన్ని అమలు చేయాలన్నారు. సామాజిక భద్రతా చట్టాన్ని అమలు చేయకుండా 47 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చేసి కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నదన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రం ఉల్లంఘిస్తున్నదని విమర్శించారు. ప్రమాద, ఆరోగ్య బీమా పథకాలను అమలు చేయాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అసంఘటిత కార్మికుల ఎన్నికల ఎజెండాను రూపొందించి జనవరి 26న గణతంత్ర దినోత్సవం రోజు విడుదల చేసి రాజకీయ పార్టీలకు అందించాలని జాతీయ సదస్సు నిర్ణయించినట్టు పేర్కొన్నారు. సదస్సులో తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

రవాణా కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

హిమాయత్‌నగర్, జనవరి 7: రాష్ట్ర వ్యాప్తంగా రవాణా రంగంలో పనిచేసే కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం కోరారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉన్నత విద్యను అభ్యసించిన ఎంతో మంది సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఆటోలను నడుపుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఆటో, మోటార్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, గ్రేటర్ హైదరాబాద్‌లో కొత్త ఆటోకు పర్మిట్లు ఇచ్చి, ఆటో మీటరు చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. 50 ఏండ్లు నిండిన ఆటో డ్రైవర్లకు పింఛన్లు ఇవ్వడంతో పాటు ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంచాలని కోరారు.

అమెరికా కంపెనీతో సీసీఎంబీ ఒప్పందం

సిటీబ్యూరో, జనవరి 7(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ కేంద్రంగా లైఫ్ సైన్సెస్ స్టార్టప్‌లకు ఊతమిచ్చేలా మరో కీలక ఒప్పందం కుదిరింది. సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ (సీసీఎంబీ)తో అమెరికాకు చెందిన బయో టెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ థర్మో ఫిషర్ సైంటిఫిక్ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నది. సీసీఎంబీలోని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌తో కలిసి లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్త టెక్నాలజీ రూపకల్పన, వినియోగంపై ఇరు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. ఈ ఒప్పందం ద్వారా బయో టెక్నాలజీలో కొత్త ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుందని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అవకాశాలు పెరుగుతాయని సీసీఎంబీ వర్గాలు భావిస్తున్నాయి.